

# కొత్త క్రికెట్ స్టేడియం..

పశ్చిమగోదావరి: జిల్లా ఉండి నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా యువతకు గుడ్ న్యూస్.. ఉండి హైస్కూల్ గ్రౌండ్‌ను క్రికెట్ స్టేడియంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ విషయాన్ని ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. దాతల సాయంతో సుమారు 80 లక్షలు ఖర్చు చేసి ఉండి హైస్కూలును అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులను ప్రారంభించిన రఘురామకృష్ణరాజు.. ఉండి హైస్కూల్ గ్రౌండ్‌ను జిల్లా క్రికెట్ స్టేడియంగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియషన్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని యువత నైపుణ్యాలను వెలికి తీసేందుకు అనేక చర్యలు తీసుకుంటోంది. అలాగే రాజధాని అమరావతిలోనూ స్పోర్ట్స్ సిటీ పేరుతో అంతర్జాతీయ క్రీడా నగరాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తున్న సంగతి తెలిసిందే. ఈ స్పోర్ట్స్ సిటీలో అమరావతి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, బ్యాడ్మింటన్, క్రికెట్ అకాడమీలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నారు. అలాగే రాష్ట్రంలో పలుచోట్ల క్రికెట్ స్టేడియాల నిర్మాణానికి కూడా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో త్వరలోనే ఓ క్రికెట్ స్టేడియం ఏర్పాటు కానుంది.

ఉండి హైస్కూల్ గ్రౌండ్‌ను జిల్లా క్రికెట్ స్టేడియంగా తీర్చి దిద్దే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ విషయాన్ని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉండి హైస్కూల్ గ్రౌండ్‌ను జిల్లా క్రికెట్ స్టేడియంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు రఘురామకృష్ణరాజు తెలిపారు. ఈ క్రమంలోనే రఘురామకృష్ణరాజు స్నేహితులు, సన్నిహితులు, పాఠశాల పూర్వ విద్యార్థులు, దాతల సహకారం ఉండి ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

రూ.80 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రయోగశాలల ఏర్పాటు, పూడిక పనులు, సీసీ రోడ్లు, పచ్చదనం - పరిశుభ్రత, ఆట స్థలాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా మంగళవారం ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాట్లాడిన రఘురామకృష్ణరాజు.. ఉండి హైస్కూలు గ్రౌండ్‌ని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కిచ్చి స్టేడియంగా మార్చాలనే ప్రతిపాదనకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు. అలాగే ఉండి అభివృద్ధి కోసం ఆలోచనలు ఉంటే పంచుకోవాలని ప్రజలను కోరారు. భీమవరానికి ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశం ఉండికే ఉందని.. అందుకే ఉండి అభివృద్ధి కోసం సలహాలు, సూచనలు ఉంటే పంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మరోవైపు ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను రఘురామకృష్ణరాజు సన్మానించారు. 80 లక్షలకు పైగా ఖర్చు చేసి ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పాఠశాల భవనాన్ని పునరుద్ధరించారని.. అధునాతన మౌలిక, క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# చితాభస్మంతో శివయ్యకు అభిషేకం

రాజమహేంద్రవరం: శ్మశానాన్ని కూడా ఇలా చేయొచ్చా.. చూడటానికి పార్క్‌లా ఉంది.. ఆ పక్కనే శివాలయం కూడా ఉంది. ప్రతి ఒక్కరికీ మరణం తర్వాత గౌరవంగా సాగనంపాలి అంటారు.. అనంతర కార్యక్రమాలు శాస్త్ర ప్రకారం జరగాలని కోరుకుంటారు. ఈ మంచి ఆలోచనతో రాజమహేంద్రవరానికి చెందిన రోటరీ క్లబ్ ప్రతినిధి పట్టపగలు వెంకటరావు 1997లో గోదావరి గట్టున ఒక శ్మశానాన్ని 17.52 ఎకరాల్లో నిర్మించారు. దీని పేరు రోటరీ కైలాస భూమి. ఇందులో కొంత స్థలాన్ని మృతదేహాలను పూడ్చడానికి కేటాయించారు. దహనం చేయాలనుకుంటే కట్టెలను కూడా వారే ఇస్తారు.

ఇక్కడ 3 ఎకరాల్లో చెట్లు, పూల మొక్కలు ఉన్నాయి. సంప్రదాయానికి తగ్గట్టుగా కార్యక్రమాలు చేయడానికి అన్ని వసతులు ఏర్పాటు చేశారు. అవసరమైతే కైలాస భూమి వాహనాల్లో మృతదేహాలను తీసుకొచ్చి అంత్యక్రియలు చేస్తారు.. రుసుములు కూడా తక్కువగానే ఉంటాయట. ఇక్కడ శ్మశానంలో దహనం చేసిన వారి చితాభస్మాన్ని కైలాస భూమి పక్కనే ఉన్న మహాకాళేశ్వర ఆలయం లోని శివయ్యకు తెల్లవారు జామున అభిషేకం చేస్తారట.



గోదావరి తీరాన నిర్మించిన కైలాస భూమికి 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' కూడా పొందినట్లు చెబుతున్నారు. కరోనా సమయంలో కూడా సంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారట. ఎన్నో అనాథ శవాలు, మున్సిపాలిటీ, రైల్వేవారు తీసుకొచ్చిన శవాలు, సెంట్రల్ జైలులో చనిపోయావారు, వృద్ధాశ్రమాలలో చనిపోయిన వారికి రూపాయి కూడా తీసుకోకుండా ఇక్కడ ఉచితంగా దహన సంస్కారాలు నిర్వహించారట. కొందరు వారికి తోచిన విధంగా విరాళాలు కూడా అందించారట.

ఈ శ్మశానానికి పక్కన గోదావరి నది ఒడ్డున గౌతమీ ఘాట్‌లో రెండు ఎకరాలలో మహాకాళేశ్వర ఆలయం నిర్మించారు. గోమయం పిడకల్ని విభూతిగా మార్చి అభిషేకిస్తారు.. శ్మశానంలో మొదట కాలిన శవం బూడిదతో అభిషేకం నిర్వహిస్తారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల వరకు భస్మాభిషేకం నిర్వహిస్తారు. ఈ భస్మాభిషేకం కోసం ఆలయం పక్కన రోటరీ క్లబ్ నిర్వహిస్తోన్న కైలాస భూమి నుంచి ఈ హారతి కోసం చితాభస్మాన్ని శాస్త్రోక్తంగా సేకరించి ఆలయానికి తీసుకొస్తారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు..

## రెండు సర్పంచ్‌లు టీడీపీ కైవసం
## ఆ మూడుచోట్ల కూడా గెలుపు

ఏపీ: స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల్లో కొండపి, కడియపులంక సర్పంచి స్థానాల్లో టీడీపీ గెలిచింది. ఆ రెండు చోట్ల టీడీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిపల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వేపకారిపల్లి ఎంపీటీసీ.. నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం విడవలూరు-1 ఎంపీటీసీ.. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం లోని మణీంద్రం ఎంపీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా టీడీపీ అభ్యర్థులు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. ప్రకాశం జిల్లా కొండపి పంచాయతీ, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ కడియపులంక సర్పంచ్ స్థానాల్లో టీడీపీ గెలిచింది. కడియపులంక సర్పంచిగా ఎం పద్మావతి, కొండపి పంచాయతీ సర్పంచిగా కె.సుశీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాచర్ల నియోజకవర్గంలో వేపకంపల్లి ఎంపీటీసీ, నెల్లూరు జిల్లా కోవూరులోని విడవలూరు-1 ఎంపీటీసీ, కుప్పం నియోజకవర్గంలో మణీంద్రం ఎంపీటీసీ స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రకాశం జిల్లా కొండపి గ్రామ సర్పంచిగా కొమ్ము సుశీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 14 వార్డులకు 39 మంది నామినేషన్లు దాఖలు చేశారు.. సర్పంచి పదవికి 15 మంది



నామినేషన్లు సమర్పించారు. అయితే చివర్లో అందరూ నామినేషన్లు ఉపసంహరించు కోవడంతో కొమ్ము సుశీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 14 వార్డులకు గానూ టీడీపీకి తొమ్మిది, వైఎస్సార్‌సీపీకి ఐదుగురు ఏకగ్రీవం అయ్యారు. కొండపి సర్పంచ్ ఎన్నికలు 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి.. కోర్టులో లైన్ క్లియర్ అయ్యాక ఎన్నికలు జరిగాయి. ఇటు రాజమహేంద్రవరం రూరల్ కడియపులంక సర్పంచ్‌గా మాదిశెట్టి పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ మరణంతో ఇక్కడ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చారు.. అయితే చనిపోయిన సర్పంచ్ అమ్మాణీ కుమార్తె మాదిశెట్టి పద్మావతి నామినేషన్ దాఖలు చేశారు. మరో మహిళల నామినేషన్ దాఖలు చేయగా.. ఆమె చివర్లో నామినేషన్ ఉపసంహరించు కోవడంతో రేసులో ఒకరే ఉండటంతో.. మాదిశెట్టి పద్మావతి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందుల.. అలాగే ఒంటిమిట్టలో జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు స్థానాలకు ఈనెల 12న పోలింగ్ ఖాయమైంది. 2021లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు చోట్ల వైఎస్సార్‌సీపీ గెలిచింది. పులివెందుల జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి మరణించడం, ఒంటిమిట్ట జెడ్పీటీసీగా గెలిచిన ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి ఎమ్మెల్యే కావడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. పులివెందుల నుంచి మహేశ్వరరెడ్డి కుమారుడు హేమంత్ కుమార్, టీడీపీ నుంచి బీటెక్ రవి భార్య లతారెడ్డి పోటీ చేస్తున్నారు. ఒంటిమిట్టలో వైఎస్సార్‌సీపీ నుంచి సుబారెడ్డి, టీడీపీ నుంచి ముద్దుకృష్ణా రెడ్డి పోటీలో ఉన్నారు.

# రాజకీయాల్లోకి వస్తానంటున్న వెటరన్ హీరో..

ఏపీ: రాజకీయాల్లోకి ఎంట్రీపై సీనియర్ నటుడు సుమన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ కార్యక్రమంలో పొలిటికల్ ఎంట్రీపై మీడియా ప్రతినిధులకు క్లారిటీ ఇచ్చారు. పొరుగు రాష్ట్రం నుంచి తనకు టికెట్ ఆఫర్ వచ్చిందని.. కానీ తాను అంత ఇంట్రెస్ట్‌గా లేనని చెప్పారు. అయితే వచ్చే ఎన్నికల నాటికి ఏపీ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తానని సంకేతాలు పంపారు. అలాగే ఏపీలో కూటమి ప్రభుత్వ పాలనపైనా స్పందించారు సుమన్.



రాజకీయ ప్రవేశంపై సినీ నటుడు సుమన్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2029 ఎన్నికల నాటికి ఏపీ రాజకీయాల్లోకి వస్తానని పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. సుమన్ ఓ ప్రైవేట్ ఆఫీస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లోకి ఎంట్రీ ఉంటుందని చెప్పుకొచ్చారు.. తనకు పొరుగు రాష్ట్రాల నుంచి రాజకీయాల్లోకి రమ్మని ఆహ్వానాలు వస్తున్నాయన్నారు. 'ఏపీలో ఇప్పుడు ఎన్నికలు లేవు.. వచ్చే ఎన్నికల నాటికి చూద్దాం.. ఆలోచించి నిర్ణయం తీసుకుంటా.. 2026లో వేరే రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నాయి.. వాటికి పిలుస్తున్నారు' అని సుమన్ చెప్పుకొచ్చారు.

'తమిళనాడులో 2026లో ఎన్నికల ఉన్నాయి.. టికెట్ ఇస్తామని నన్ను పిలుస్తున్నారు. నేను పుట్టింది, పెరిగింది తమిళనాడు.. నేను ఉండేది వేరేచోట, ఎన్నికలు జరుగుతుంది మరోచోటని వాళ్లకు చెప్పాను. వచ్చే ఎన్నికలనాటికి చూస్తాను (ఏపీ రాజకీయాల్లోకి రావడం గురించి).. ఏపీలో ఉన్న ప్రభుత్వానికి అందరూ మద్దతు ఇవ్వాలి. ప్రాజెక్టుల్ని చేస్తున్నారు.. కొన్ని టైం పడుతుంది, కొన్ని ఆలస్యం కావొచ్చు. రోడ్ల పనులు చేపట్టారు.. రాష్ట్రంలో కొన్ని డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు మద్దు తెలపాలి. అందర్ని సంతృప్తిపరచాలంటే కష్టం.. అందుబాటులో ఉన్నవి చేస్తున్నారు.. అందరూ బావుండాలి' అని సుమన్ చెప్పుకొచ్చారు. గతంలో కూడా నటుడు సుమన్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రశంసలు కురిపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు వంటి అనుభవజ్ఞుడైన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల అదృష్టమని వ్యాఖ్యానించారు. తన పొలిటికల్ రీ-ఎంట్రీ గురించి కూడా స్పష్టత ఇచ్చారు. వాజ్‌పేయి, చంద్రబాబు ఉన్న సమయం లోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని.. చంద్రబాబు పిలిస్తే రాజకీ యాల్లోకి వస్తానన్నారు. ఆయన పరిపాలనా దక్షత, విజన్ ఉన్న నేత అన్నారు. తన రాజకీయ గురువు చంద్రబాబు నాయుడు అని చెప్పుకొచ్చారు సుమన్. చంద్రబాబును చూసే సభల్లో ఎలా మాట్లాడాలో నేర్చుకున్నానని.. ఆయన ఆధ్వర్యంలో అమరావతి త్వరగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఇప్పుడు మరోసారి రాజకీయాల్లోకి రావడంపై స్పందించారు. నటుడు సుమన్ గతంలో రాజకీయాల్లో కూడా పనిచేశారు. 1999లో తెలుగు దేశం పార్టీలో చేరి ఎన్నికల్లో ప్రచారం చేశారు.. 2004లో బీజేపీలో చేరారు.. అయితే ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

# మరో హామీ అమలు..

ఏపీ: మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకు న్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ కర్నూలు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కర్నూలులోని గూడెం కొట్టాల వాసులు నారా లోకేష్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. 40 ఏళ్ల నుంచి ఉంటున్నామని.. శాశ్వత ఇళ్లపట్టాలు ఇప్పించాలని కోరారు. దీంతో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన లోకేష్.. తాజాగా 150 మందికి శాశ్వత ఇళ్లపట్టాలు పంపిణీ చేయించారు. మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.



ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మరో హామీని నిలబెట్టుకున్నారు. 2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు నారా లోకేష్ యువగళం పాదయాత్ర నిర్వహించిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా యువగళం పాదయాత్ర నిర్వహించిన నారా లోకేష్.. తాను పర్యటించిన ప్రాంతాలలోని సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఆయా ప్రాంతాలవాసుల కష్టనష్టాలను తెలుసుకుని టీడీపీ అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ విధంగానే కర్నూలు జిల్లాలో యువగళం పాదయాత్ర సందర్భంగా కర్నూలు అశోక్‌నగర్‌లోని గూడెం కొట్టాల వాసులకు నారా లోకేష్ అప్పట్లో హామీ ఇచ్చారు. అశోక్‌నగర్‌లోని పంప్ హౌస్ ప్రాంతంలో గూడెం కొట్టాల వాసులు సుమారుగా 40 ఏళ్ల నుంచి పూరిగుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. అయితే తమకు శాశ్వత ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటూ గత కొన్నేళ్లుగా వీరు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఈ క్రమంలోనే నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా అప్పటి కర్నూలు నియోజకవర్గం టీడీపీ ఇంఛార్జి టీజీ భరత్ నేతృత్వంలో గూడెం కొట్టాల వాసులు నారా లోకేష్‌ను కలిశారు. తమకు శాశ్వత ఇళ్లపట్టాలు ఇప్పించాలని కోరారు. దీంతో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గూడెంకొట్టాల వాసుల సమస్యను పరిష్క,రిస్తామని నారా లోకేష్ వారికి హామీ ఇచ్చారు ఇక ఇచ్చిన హామీ ప్రకారం తాజాగా 150 మంది గూడెం కొట్టాల వాసులకు శాశ్వత ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. 2025 జనవరిలో టీడీపీ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.30 ద్వారా ఎకరా స్థలాన్ని 150 మంది పేదలకు ఇళ్లపట్టాల కింద పంపిణీ చేశారు. మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా బుధవారం శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం.. ఇళ్లపట్టాలు పంపిణీ చేసినట్లు మంత్రి టీజీ భరత్ చెప్పారు. జనవరిలో జారీ చేసిన జీవో 30 కింద తొలిసారిగా మంగళగిరిలో ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తే, రెండోసారి కర్నూలులో ఇచ్చామని గుర్తు చేశారు. ఇంత వేగంగా పని పూర్తి చేసినందుకు అధికారులను టీజీ భరత్.. అభినందించారు. సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్న మంత్రి టీజీ భరత్.. ఈ క్రమంలోనే ఏడాది ఆఖరు నాటికి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు ప్రస్తుతం గూడెం కొట్టాలలోని 150 మందికి రెవెన్యూ పట్టాలు అందించామని.. త్వరలోనే రిజిస్టర్డ్ పట్టాలు ఇస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గూడెం కొట్టాల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# కొత్త నేషనల్ హైవే ఆరు లైన్లుగా..

ఏపీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేషనల్ హైవే ప్రాజెక్టుల పనులు వేగవంతం అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు హైవేల పనులకు నిధులు విడుదల చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో కీలకమైన గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి పనులు కొంత ఆలస్యం అవుతున్నాయి. వాస్తవానికి ఈ ఏడాది పనులు పూర్తవుతాయని భావించారు.. కానీ కష్టమనే అంటున్నారు. రెండు కిలోమీటర్ల మేర అసలు రోడ్డు పనులు ఇప్పటి వరకు ప్రారంభంకాలేదు..

ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన విశాఖపట్నం-రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం పనులు వేగవంతం అయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ 2022 నవంబరులో ఈ 464 కిలోమీటర్ల రహదారికి శంకుస్థాపన చేశారు. 2024 చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల గడువును ఈ ఏడాది డిసెంబరు వరకు పొడిగించారు. అయితే విశాఖపట్నం జిల్లాలో కంటకాపల్లి-సబ్బవరం మధ్య పనులు మాత్రం ఆలస్యం అయ్యే అవకాశం ఉందంటున్నారు.. వచ్చే ఏడాదికి ఈ పనులు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు.

ఈ రాయపూర్ నేషనల్ హైవేలో విశాఖపట్నం జిల్లాలో ప్యాకేజీ-4 కింద కంటకాపల్లి- సబ్బవరం మధ్య 19.562 కి.మీ. పొడవున పనులు జరుగుతున్నాయి. అయితే 2 కిలో మీటర్లు మినహా రోడ్డు పనులు ముగింపు దశకు వచ్చాయి. ఈ పనుల్ని రూ.638 కోట్లు అంచనా వ్యయంతో చేస్తుండగా.. ఉత్తరావల్లి- కంటకాపల్లి మధ్య 2కి.మీ హైవే పనులు ఇప్పటి వరకు మొదలుపెట్టలేదు. ఈ 2 కిలో మీటర్ల కోసం ప్రతిపాదనలు చేసిన భూమి జీఎంఆర్ సంస్థది కావడంతో.. పరిహారం పెంచాలని కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం తక్కువగా ఉంది అంటున్నారు. అలాగే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కూడా కోర్టులో పిల్ వేసింది. ఈ వ్యవహారం కోర్టుకు చేరడంతో పనులు ప్రారంభంకాలేదు. విశాఖపట్నం- అరకు నేషనల్ హైవే పక్కన గాంధీనగర్ దగ్గర లింక్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. అలాగే ఈ హైవేలో.. రాయపురాజుపేట దగ్గర కొత్తవలస- కిరండూల్ రైల్వే లైన్‌పై ఫ్లై ఓవర్ నిర్మాణం చేస్తున్నారు.



గులివిందాడ, కొండదాబాలు ప్రాంతాల్లో నేషనల్ హైవే పనులు నిలిచిపోయాయి. గులివిందాడ దగ్గర టోల్ ప్లాజా నిర్మాణం ఆగిపోయింది. కొత్తవలస- కె.కోటపాడు రోడ్డులో కొండదాబాలు దగ్గర బ్రిడ్జి నిర్మాణం కూడా ఆగిపోయింది. విద్యుత్ లైన్ల మార్పు, భూసేకరణ సమస్యల కారణంగా ఆగింది. త్వరలోనే పనులు మొదలవుతాయంటున్నారు అధికారులు. గులివిందాడ దగ్గరలో 400 కేవీ విద్యుత్ లైను మార్చాల్సి ఉండగా.. దీనికి అనుమతులు రావడంతో త్వరలో పనులు మొదలు పెడతామంటున్నారు. కొండదాబాలు దగ్గర బ్రిడ్జి కోసం హైవేకు ఇరువైపులా పిల్లర్లు వేసి కాంక్రీట్ బ్లాకులు సిద్ధం చేశారు. అయితే ఇక్కడ కూడా 400 కేవీ విద్యుత్తు లైన్‌ను మార్చాల్సి ఉంది.

ఈ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల మీదుగా వెళ్తుంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే విశాఖపట్నం నుంచి ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు ప్రయాణ సమయం సగానికి తగ్గుతుంది. 12 గంటల కాకుండా 6 గంటల్లోనే వెళ్లొచ్చంటున్నారు. విశాఖపట్నం పోర్టు నుంచి సరుకులు ఇతర ప్రాంతాలకు త్వరగా చేరవేయడానికి ఈ హైవే ఉపయోగపడుతుంది. ఈ హైవే విశాఖపట్నం దగ్గరలోని సబ్బవరం వద్ద కోల్‌కతా-చెన్నై నేషనల్ హైవే 16కు కలుస్తుంది. ఈ పనుల్ని వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరతున్నారు.

# అరుంధతి సినిమాలో కోట ఎక్కడుందో తెలుసా..

నంద్యాల: టాలీవుడ్‌లో అరుంధతి సినిమా సూపర్ హిట్ సాధించింది.. అయితే అరుంధతి సినిమా పేరు చెప్పగానే ప్రతి ఒక్కరికి గుర్తు కొచ్చేది కోట.. ఈ కట్టడం ఆంధ్రప్రదేశ్‌లో ఉందని తెలుసా.. అవును నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం పాతపాడు శివారులో ఈ కోట ఒక పెద్ద గట్టు మీద ఉంది. ఈ సినిమా షూటింగ్ తర్వాత దీనిని అరుంధతి బంగ్లాగా పేరు వచ్చింది. ఈ కట్టడాన్ని 120 ఏళ్ల క్రితం బనగానపల్లి చివరి నవాబు మీర్‌ఫజల్ అలీఖాన్ నిర్మించారు. అయితే ఇక్కడ నవాబు వారసులు సందర్శకుల నుంచి రుసుము వసూలు చేస్తున్నారట. ఈ బంగ్లా శిథిలావస్థకు చేరుకున్నా సంరక్షణకు చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. బనగానపల్లెను మొదట మొగలు చక్ర వర్తుల సామంతులు పాలించేవారట. ఆ తర్వాత 1724లో హైదరాబాదు నిజాం సామంతులుగా ఫైజ్ వారసులు పరిపాలిం చారు. హుసేన్ ఆలీ ఖాన్ ప్రభువు అయ్యారు.. ఆయన 1783లో మరణించిన తర్వాత అతడి చిన్న కుమారుడు గులాం మొహ్మద్ అలీ రాజయ్యాడు. బనగానపల్లె సంస్థానం తొలినాళ్లలో బ్రిటీష్ ఇండియాలో భాగంగా ఉండేది. తెలుగు ప్రాంతాల్లో హైదరాబాద్ కాకుండా సంస్థానం హోదా పొందిన ఏకైక ప్రాంతం బనగానపల్లె. 1948లో బనగానపల్లె సంస్థానాన్ని దేశంలో కలిపారు కోటలో 9 గదులు, ఒక పెద్ద హాలు, కింద నేలమాళిగ ఉన్నాయి. కర్నూలుకు 80 కిలోమీటర్ల దూరంలో ఈ కోట ఉంది.

# విశాఖపట్నంవాసుల కొత్త డిమాండ్..

తిరుమల: శ్రీవారి దర్శనం కోసం టీటీడీ శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేస్తున్న సంగతి తెలిసిందే. తిరుపతి విమానాశ్రయంలో కౌంటర్ ఏర్పాటు చేసి రోజుకు 200 టికెట్లు ఇస్తున్నారు. అయితే ఈ టికెట్ల విషయంలో విశాఖపట్నం వాసులు ఇబ్బందిపడుతున్నారట. విశాఖపట్నం నుంచి వెళ్లే విమానం మధ్యాహ్నానికి తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటోంది. కానీ 200 దర్శన టికెట్లు ఉదయం 9లోపే ఖాళీ అవుతున్నాయి.. కౌంటర్ మూసివేవస్తున్నారని చెబుతున్నారు. శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. అయితే విశాఖపట్నానికి చెందిన భక్తులకు ఓ సమస్య వచ్చింది.. సాగర తీర నగరం నుంచి వస్తున్న విమానం టైమింగ్‌తో ఇబ్బందిపడుతు న్నారట. తిరుపతి విమానాశ్రయంలో శ్రీవాణి టికెట్లు అందుబాటులో ఉన్నాయి.. టీటీడీ ప్రత్యేక కౌంటర్ ద్వారా విక్రయిస్తున్నారు. ప్రతిరోజు 200 టికెట్లు మాత్రమే ఇస్తారు.. ఉదయం 8 గంటలకు కౌంటర్ తెరుస్తారు.. విమానంలో వచ్చిన ప్రయాణికులకు మాత్రమే ఈ టికెట్లు ఇస్తారు. దర్శన టికెట్ కోసం బోర్డింగ్ పాస్, గుర్తింపు కార్డు చూపించాలి. రూ.10 వేలు శ్రీవాణి ట్రస్ట్‌కు విరాళంతో పాటుగా రూ.500 టికెట్ ధర చెల్లించాలి. తిరుమలలో గది కూడా కేటాయిస్తారు. తిరుమల శ్రీవారి శ్రీవాణి దర్శన టికెట్లు ఉదయం 9 గంటలకే



అయిపోతున్నాయని చెబుతున్నారు. ఆ తర్వాత విమానాల్లో వచ్చిన వారికి టికెట్లు దొరకడం లేదు. ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలలోపు హైదరాబాద్ నుంచి ఐదు విమానాలు వస్తున్నాయి.. వీటిలో ఢిల్లీ నుంచి ఒకటి, ముంబై నుంచి ఒకటి ఉదయం 10 గంటలలోపు వస్తాయి. దీంతో టీటీడీ జారీ చేస్తున్న శ్రీవాణి టికెట్లు 200 కోటా పూర్తవుతోంది. అయితే విశాఖపట్నం నుంచి విమానం షెడ్యూల్ కారణంగా టికెట్లు పొందలేక పోతున్నామని భక్తులు చెబుతున్నారు. విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం బయలుదేరే విమానం తిరుపతికి మూడు గంటలకు చేరుకుంటుంది.. కానీ అప్పటికే శ్రీవాణి టికెట్ల కౌంటర్ మూసివేస్తున్నారు. విశాఖప ట్నం నుంచి వచ్చే భక్తులకు టికెట్లు లభించడం లేదు. ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు ఈ విమాన వేళలు మార్చాలని.. లేని పక్షంలో విశాఖపట్నం ప్రయాణికులకు శ్రీవాణి టికెట్లు కేటాయించాలని కోరుతున్నారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో దర్శన టికెట్లు కేటాయించేలా ప్లాన్ చేయాలంటున్నారు. శ్రీవాణి టికెట్ల కేటాయింపు విధానంపై భక్తులు, ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు కొన్ని సూచనలు చేస్తున్నారు. "ఎవరు ముందు వస్తే వారికే" అనే పద్ధతి కాకుండా, విమానానికి టికెట్లు కేటాయించాలని కోరుతున్నారు. దేశంలోని ప్రతి విమానాశ్రయానికి శ్రీవాణి టికెట్లు కేటాయించి, స్థానికంగానే అందించాలని చెబుతున్నారు.

